


నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మల్లారెడ్డి మధులతారెడ్డి (హైదరాబాద్‌) రూ.లక్ష విరాళాన్ని గురువారం సమర్పించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్‌ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 1,875, మధ్య డెల్టాకు 1,345, పశ్చిమ డెల్టాకు 3,535 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
44.0°/29.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.0	29.5
కాకినాడ	41.0	29.8
అమలాపురం	43.0	29.0

న్యూస్‌రీల్‌

మహిళా సమ్మాన్‌ సేవింగ్స్‌ మహామేళా



పథకంలో చేరేందుకు అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయానికి వచ్చిన మహిళలు

అమలాపురం టౌన్‌: అన్ని వర్గాలకు చెందిన మహిళలు మహిళా సమ్మాన్‌ సేవింగ్స్‌ సర్టిఫికెట్‌ -2023 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అమలాపురం పోస్టల్‌ డివిజన్‌ సూపరింటెండెంట్‌ సలాది శ్రీధర్‌ విజ్ఞప్తి చేశారు. మహిళలు, బాలికలను ఇందులో భాగస్వాములను చేసేందుకు పోస్టల్‌ శాఖ ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకూ మహిళా సమ్మాన్‌ సేవింగ్స్‌ సర్టిఫికెట్‌ 2023 మహామేళాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 20న జరిగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 65వ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. పోస్టల్‌ డివిజన్‌ పరిధిలోని మహిళలు, మైనర్‌ బాలికలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని పొదుపు చేసుకోవాలని శ్రీధర్‌ విజ్ఞప్తి చేశారు. ఈ పథకంలో వడ్డీ 7.5 శాతం లభిస్తుందని వివరించారు. కాల పరిమితి రెండు సంవత్సరాలు. రూ.1000 నుంచి రూ.2 లక్షల వరకూ డిపాజిట్‌ చేసుకోవచ్చని సూచించారు.

కాలేయ మార్పిడికి రూ.10 లక్షలు మంజూరు



రూ.10 లక్షల సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

కాట్రేనికోన: మండలంలోని కొప్పిగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌ సీపీ మండల బీసీ సెల్‌ నాయకుడు కొప్పిశెట్టి రమణ(వెంకటేశ్వరరావు) కాలేయ శస్త్ర చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10 లక్షలు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ బాధితుని కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. కాలేయ సంబంధిత వ్యాధితో రమణ కొంతకాలంగా బాధ పడుతున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లగా సీఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో కందికుప్ప పీఏసీఎస్‌ అధ్యక్షుడు ఏడిద సుబ్బు, పాలెపు ధర్మారావు పాల్గొన్నారు.

ఎంపీపీపై దాడి హేయం

కపిలేశ్వరపురం: కాకినాడ జిల్లా రౌతులపూడి మండల అధ్యక్షురాలు విజయలక్ష్మిపై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చట్టపరిధిలో కఠిన చర్యలు తీసుకోవాలని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా ఎంపీపీల సమాఖ్య అధ్యక్షురాలు మేడిశెట్టి సత్యవేణి గురువారం డిమాండ్‌ చేశారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి విజయలక్ష్మిపై దాడి హేయమైన చర్య అన్నారు. ఆమె చైర్మన్‌గా ఉన్న పీహెచ్‌సీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించకపోవడంతో పాటు ప్రశ్నించిన ఆమెపై దాడికి పాల్పడటం అప్రజాస్వామికమన్నారు.

హెవీ డ్రైవింగ్‌ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్‌: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలాపురం డిపోలో హెవీ డ్రైవింగ్‌ స్కూల్‌ ద్వారా త్వరలో ఏడవ బ్యాచ్‌ శిక్షణ తరగతి ప్రారంభిస్తున్నట్టు డిపో మేనేజర్‌ చల్లా సత్యనారాయణమూర్తి గురువారం తెలిపారు. 21 సంవత్సరాలు నిండి, లైట్‌ వెహికల్‌ డ్రైవింగ్‌ లైసెన్స్‌ కలిగి ఉండి డ్రైవింగ్‌లో ఒక సంవత్సరం అనుభవం కలిగినవారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎంజీ రజాక్‌, డ్రైవింగ్‌ ఇన్‌స్పెక్టర్‌ను 7382909588 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పెళ్లి భోజనాలు, టిఫిన్స్‌ రుసుము పెంపు

అన్నవరం: రత్నగిరిపై వివాహాలు చేసుకునే వివాహ బృందాలు తాము సొంతంగా వండించిన ఆహార పదార్థాలను కొండదిగువ నుంచి రత్నగిరికి తీసుకువెళ్లేందుకు గాను చెల్లించాల్సిన రుసుములను అధికారులు పెంచారు. భోజనాల రుసుమను రూ.5 వేలు, టిఫిన్స్‌ రుసుమును రూ.వేలుకు పెంచారు. గతంలో భోజనాలకు రూ.3 వేలు, టిఫిన్స్‌కు రూ.1,500 వసూలు చేసేవారు. ఈ మొత్తం టోల్‌గేట్‌ వద్ద దేవస్థానానికి చెల్లించి ఆహార పదార్థాలను దేవస్థానానికి తీసుకువెళ్లవచ్చు. కళాశాల మైదానంలో వంటలు చేసుకుంటే రూ.100 చెల్లించాలి. శానిటరీ చార్జెస్‌ కింద రూ.100 చెల్లించాలి.

ఆపద్బాంధవి వైఎస్సార్‌ బీమా

- నేటితో ముగియనున్న నమోదు
- 94.41 శాతంతో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానం
- ప్రీమియం చెల్లింపు బాధ్యత ప్రభుత్వానిదే

సాక్షి అమలాపురం: ఆపత్కాలంలో అండగా నిలిచే వైఎస్సార్‌ బీమా రెన్యువల్‌ జిల్లాలో శరవేగంగా సాగింది. బీమాకు అర్హులైన కుటుంబాలను గుర్తించే సర్వేలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లాలో ఇప్పటికే 94.41 శాతం నమోదు చేసిన జిల్లా యంత్రాంగం శుక్రవారంతో బీమా నమోదు పూర్తి కానున్న నేపథ్యంలో 100 శాతం లక్ష్యం పూర్తి చేయాలనే పట్టుదలతో పనిచేస్తోంది.

పేదలకు అండగా...

కరోనా తరువాత మారిన ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో పలువురు బీమా చేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. యువత, నడివయసు వారు మృత్యువాత పడుతుండడంతో కుటుంబం ఆర్థికంగా చిన్నాభిన్నమవుతోంది. అయితే ఉన్నత వర్గాల వారు, ఉద్యోగులు, ఆర్థికంగా కాస్త బలంగా ఉన్నవారు సొంతంగా బీమా చేయించుకుంటున్నారు. మధ్య తరగతి, నిరుపేదలు బీమా చేయించు కోవడంలో వెనుకబడి ఉంటున్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌ బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు 2023–24 సంవత్సరానికి క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టింది. ఈ సర్వే శుక్రవారంతో పూర్తి కానుంది. వలంటీర్ల వ్యవస్థ పటిష్టంగా ఉండడంతో ఇంటింటికీ వెళ్లి పక్కాగా సర్వే చేపట్టారు. వారు సేకరించిన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్‌ అసిస్టెంట్లు నమోదు చేసుకుని అర్హులను ఎంపిక చేస్తున్నారు. బియ్యం కార్డు కలిగిన కుటుంబ యజమాని పేరిట బీమా చేస్తారు. ప్రీమియం చెల్లింపు బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించడం వల్ల వారికి ఆర్థిక వెసులుబాటు కలిగింది.



ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెంలో వైఎస్సార్‌ బీమా వివరాలు నమోదు చేస్తున్న వార్డు వలంటీర్‌

విస్తృతంగా సర్వే

జిల్లా పరిధిలో ఈ సర్వే అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోనూ, 22 మండలాల్లోని 315 గ్రామాల్లో నిర్వహించారు. జిల్లాలో మొత్తం కుటుంబాలు 5,38,305 ఉన్నాయి. వీరిలో 4,75,431 మందిని బియ్యం కార్డుల ఆధారంగా అర్హులుగా గుర్తించారు. పాత బీమా విధానంలో 4,45,688 కుటుంబాలను రెన్యువల్‌ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 4,36,539 మందివి పూర్తి చేశారు. కొత్తగా 29,743 మందివి రెన్యువల్‌ చేయాల్సి ఉండగా, 12,335 మందివి చేశారు. ఈ రెండు కలిపి జిల్లాలో 94.41 శాతం లక్ష్యాన్ని సాధించారు. సర్వేలో జిల్లాను ద్వితీయ స్థానంలో నిలిపారు.

ప్రథమ స్థానంలో ఆత్రేయపురం

జిల్లా పరిధిలో ఆత్రేయపురం ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడ 21,679 కుటుంబాలు ఉండగా, వీటిలో 3,026 కుటుంబాలు అనర్హులుగా తేల్చారు. 17,879 పాత కుటుంబాలను బీమా పరిధిలోకి తీసుకుని రావాల్సి ఉండగా, 17,670 కుటుంబాలను గుర్తించి వారి కార్డులను పునరుద్ధరించారు. కొత్తగా 774 కుటుంబాలను బీమా పరిధిలోకి తీసుకురావాలని గుర్తించగా, ఇప్పటి వరకు 502 కుటుంబాలను నమోదు చేశారు. మొత్తం మీద ఇక్కడ 97.42 శాతం నమోదుతో ఈ మండలం అగ్రస్థానంలో నిలిచింది.

ప్రయోజనాలు ఇలా..

- వైఎస్సార్‌ బీమా పథకానికి 18 నుంచి 70 ఏళ్ల లోపు వయసు కలిగిన రైస్‌కార్డు లబ్ధిదారులు అర్హులు. వీరు 18 నుంచి 50 ఏళ్ల మధ్య సహజ మరణం పొందితే నామినీకి రూ.లక్ష బీమా మొత్తం చెల్లిస్తారు. ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందినా రూ.5 లక్షల బీమా లభిస్తుంది.
- 51 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన లబ్ధిదారులు ప్రమాదంలో మరణించినా లేక పూర్తి అంగవైకల్యం కలిగినా రూ.5 లక్షల బీమాను వారి వారసులకు చెల్లిస్తారు.

వలంటీర్లు ఉత్సాహంగా పనిచేశారు



వైఎస్సార్‌ బీమాలో అర్హుల గుర్తింపు సర్వేను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాం. వలంటీర్లు ఉత్సాహంగా పనిచేశారు. శుక్రవారం కూడా గడువు ఉన్నందున 100 శాతం లక్ష్యం సాధించగలమనే నమ్మకం ఉంది. అర్హులైన వారు స్థానికంగా ఉన్న వలంటీర్ల ద్వారా బీమా నమోదు చేయించుకోవాలి.

– డాక్టర్‌ వి.శివశంకర్‌, పీడీ, డీఆర్‌డీఏ

పవన్‌కల్యాణ్‌ను ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు

మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: పూటకో మాట, గంటకో వేషంతో ప్రజల వద్దకు వస్తున్న జనసేన నేత పవన్‌కల్యాణ్‌ను ప్రజలు ఎప్పుడో తిరస్కరించారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో యువరాజ్యం అధినేతగా ఒకసారి ఆయన జనం తిరస్కరణకు గురయ్యారని చెప్పారు. జనసేన పార్టీ పెట్టిన తరువాత రెండు చోట్ల ఓటమి పాలు కావటంతోనే జనం పూర్తిగా ఆయనను తిరస్కరించినట్టయిందన్నారు. జన సమీకరణకు డబ్బులను, చాయ్‌ బిస్కట్లను పంచాలని జనసేన నాయకులను పవన్‌ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు కోసం, ఆయన దగ్గర తీసుకున్న పారితోషికాన్ని ఖర్చు పెట్టకుండా మిగిల్చుకోవాలనే ప్రయత్నం చేస్తారా పవన్‌ అని మంత్రి ప్రశ్నించారు. పార్టీ ఆఫీసు సొంత ఖర్చులతో కడుతున్నామంటున్న పవన్‌గారూ.. దానికి స్థలం ఎవరు ఇచ్చారు అని మంత్రి ప్రశ్నించారు. చంద్రబాబు ద్వారా లింగమనేని ఆ స్థలాన్ని ఇచ్చారని ప్రజలకు తెలియదని మీరు అనుకోవటం సిగ్గుచేటు అని మంత్రి విమర్శించారు. పవన్‌వి అపరిపక్వ రాజకీయాలని మేధావులు భావిస్తున్నారన్నారు.

కామెడీ సినిమాలా ఉంది

మంగళగిరిలో గెలవలేని లోకేష్‌ రాష్ట్రంలో టీడీపీని బలపరుస్తానని తిరగడం, రెండుచోట్ల ఓడిపోయిన పవన్‌ కల్యాణ్‌ అసెంబ్లీలో అడుగుపెట్టకుండా ఎవరు అపుతారో చూస్తానని చెప్పటం, కుప్పంలో ఇల్లు కట్టకుండా ఎలా ఆపుతారో చూస్తానని చంద్రబాబు చెప్పడం కామెడీ సినిమాలా ఉందన్నారు. ఆరు నెలలకు ఒకసారి వచ్చి చంద్రబాబు స్క్రిప్టును చదివి తిరిగి హైదరాబాద్‌ వెళ్లిపోయే పవన్‌ను ప్రజలు ఎలా నమ్ముతారని మంత్రి ప్రశ్నించారు. భీమవరంలో లక్ష ఓట్లు అదనంగా పోలయ్యాయని ఎన్నిక అయిన నాలుగేళ్ల తరువాత చెప్పటం కామెడీ కాక మరేమిటన్నారు. దీనిని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. అసెంబ్లీలో ఒక్క సీటు కూడా లేని పవన్‌ కల్యాణ్‌ను చూసి 151 సీట్లు ఉన్న వైఎస్సార్‌ సీపీ భయపడుతుందని చెప్పటం పవన్‌ పిచ్చికి పరాకాష్ట అన్నారు. చంద్రబాబును సీఎం చేయటమే పవన్‌ లక్ష్యం అని మంత్రి అన్నారు. నిన్నగాక మొన్న ముఖ్యమంత్రి పదవి తనకు వద్దని చెప్పి, నేడు ఇస్తే వద్దనను అని చెప్పటం పిచ్చి కాకపోతే మరేమిటని మంత్రి అన్నారు. కాపుల రిజర్వేషన్ల విషయంలో చంద్రబాబు చేసిన మోసం, ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని పెట్టిన ఇబ్బందులు, కాపు సోదరులపై పెట్టిన కేసులు కనిపించలేదా పవన్‌ గారు అని మంత్రి ప్రశ్నించారు. పవన్‌ కల్యాణ్‌ అబద్ధపు ప్రసంగాలు వినిపిస్తున్నారని, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను పూర్తిగా తెలుసుకుని ఆయన మాట్లాడాలని మంత్రి వేణుగోపాలకృష్ణ హితవు పలికారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి వేణు

దిశ యాప్‌ మెగా డ్రైవ్‌లో జిల్లా ఫస్ట్‌

- రెండు రోజుల్లో 45 వేలకు పైగా రిజిస్ట్రేషన్లు
- జిల్లా పోలీసులను అభినందించిన ఎస్పీ శ్రీధర్‌

అమలాపురం టౌన్‌: మహిళల రక్షణకు ఆయుధంలా, రక్షణ కవచంలా ఆపదలో అక్కరకు వస్తున్న దిశ యాప్‌ డౌన్‌లోడ్‌, రిజిస్ట్రేషన్ల కోసం రాష్ట్ర పోలీసు శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 14,15 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించిన మెగా స్పెషల్‌ డ్రైవ్‌లో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌ గురువారం రాత్రి తెలిపారు. జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో ఉంచిన పోలీసులను ఎస్పీ శ్రీధర్‌ అభినందించారు. జిల్లాలో తొలి రోజు అంటే 14వ తేదీన 22,591 మంది మహిళలు దిశ యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకుని రిజిస్ట్రేషన్‌ చేయించుకుంటే రెండో రోజు 15వ తేదీన 23,400 మంది డౌన్‌లోడ్‌ చేసుకున్నారు. రెండు రోజులు కలిపి మొత్తం 45,991 మంది మహిళలు ముఖ్యంగా యువతులు, బాలికలు దిశ యాప్‌ను తమ స్మార్ట్‌ ఫోన్లలో డౌన్‌ లోడ్‌ చేయించుకుని రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారు. జిల్లా పోలీసులు, సచివాలయాల మహిళా పోలీసులు బుధ, శుక్రవారాల్లో కళాశాలల్లో విద్యార్థినులు, డ్వాక్రా మహిళలు, బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు, మహిళలు, రోడ్లపై ద్విచక్ర వాహనాలు, కార్లలో వెళ్లే మహిళలు, కుటుంబాలను ఆపి ఆ యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకునేలా శ్రమించారు. అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు ఎం.అంబికా ప్రసాద్‌, టీఎస్‌ఆర్‌కే ప్రసాద్‌, కె.వెంకటరమణ, దిశ డీఎస్పీ ఎస్‌.మురళీమోహన్‌, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు దిశ యాప్‌ డౌన్‌ లోడ్‌ మెగా స్పెషల్‌ డ్రైవ్‌లో రెండు రోజులు నిమగ్నమయ్యారు.



ఓ కళాశాలలో విద్యార్థినులతో దిశ యాప్‌ డౌన్‌లోడ్‌ చేయించిన పోలీసులు

సకాలంలో ఎరువులు, విత్తనాలు

నిల్వలను పరిశీలించిన కలెక్టర్‌ హిమాన్షు శుక్లా

ముమ్మిడివరం: ప్రస్తుత ఖరీఫ్‌ సీజన్‌లో రాయితీపై ఎరువులు, విత్తనాలను రైతులకు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం మండలం అయినాపురం-2 రైతు భరోసా కేంద్రంలో ఎరువులు, విత్తనాల నిల్వలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది క్వింటాళ్ల విత్తనాలు, 20 టన్నుల ఎరువులు ఉన్నట్లు ఆయన గుర్తించారు. ఖరీఫ్‌కు అవసరమైన వివిధ రకాల కాంప్లెక్స్‌ ఎరువులు, విత్తనాలు, రాయితీపై రైతులకు సరఫరా చేయాలని, సరఫరాలో ఎటువంటి ఫిర్యాదులకు తావులేకుండా సజావుగా రైతులకు అందించాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఖరీఫ్‌ సన్నద్ధతపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. రైతుల అవసరాల మేరకు ఎరువులు, విత్తనాల నిల్వలు ఆయా రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కోనసీమ జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని ఇప్పటికే ఈ ప్రాంతంలో పలు సంస్కరణలు తీసుకువచ్చారని కలెక్టర్‌ తెలిపారు. డ్రైనేజీలు, కాలువల్లో పూడికలు తీయించి సజావుగా సాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు గైకొన్నామన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం, వైఎస్సార్‌ యంత్ర సేవ, వ్యవసాయ ఆధునీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఖరీఫ్‌ సాగుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రైతులంతా ఖరీఫ్‌ నాట్లు వేసేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. విత్తనాల మొలకల శాతం పరిశీలించి విత్తనాలు, ఎరువుల సరఫరాపై కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకుని పక్షం రోజులకోసారి నీటి సరఫరాపై సమీక్షించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, మండల స్థాయి అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.



అయినాపురంలో విత్తనాలు, ఎరువులు నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్‌ హిమాన్షు శుక్లా

భీమేశ్వరుని హుండీ ఆదాయం రూ.12.27 లక్షలు



ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్‌: భీమేశ్వరస్వామివారి హుండీల ద్వారా రూ.12,27,043 ఆదాయం వచ్చినట్లు ఈఓ పితాని తారకేశ్వరరావు గురువారం తెలిపారు. మార్చి 29 నుంచి జూన్‌ 15వ తేదీ వరకు మొత్తం 80 రోజులకుగాను ఈ ఆదాయం సమకూరినట్లు చెప్పారు. దేవాదాయ శాఖ తనిఖీదారు ఆర్‌.బాలాజీరామ్‌ప్రసాద్‌, వెంటూరు దేవాలయం ఏఓ శ్రీదేవి, వెల్ల ఈఓ ఎంవీవీ సత్యనారాయణమూర్తి సమక్షంలో హుండీలను తెరచారు. గ్రామ పెద్దలు దామిశెట్టి గంగాపురుషోత్తం, కంచర్ల చక్రధర్‌రావు, పెమ్మిరెడ్డి రామకృష్ణ, పోలిశెట్టి రామకృష్ణ, మండపేట సేవకులు సిబ్బంది, అర్చకులు లెక్కింపులో పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా వరీఫ్‌

- జిల్లాలో 1.74 లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యం
- అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం
- రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై సరఫరా

కొత్తపేట: అన్నదాతల కష్టం తెలిసిన వైఎస్సార్‌ కాంగ్రెస్‌ ప్రభుత్వం ముందస్తుగానే వ్యవసాయానికి తోడ్పాటు అందించేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుత ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లేలా ఇరిగేషన్‌, వ్యవసాయ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. పంట దిగుబడిలో కీలకమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు చర్యలు చేపట్టింది. ముందుగానే రైతులకు అందించేందుకు విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాలకు చేరవేసింది. ముందుగా నారుమడులు పోసుకోవడానికి, వెదజల్లు పద్ధతిలో సాగు చేసే రైతులు ఇబ్బంది పడకుండా సాయపడాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ మేరకు గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ముందస్తు ఖరీఫ్‌ (తొలకరి) సీజన్‌కు సంబంధించి ఈ నెల ఒకటో తేదీన ప్రధాన పంట కాలువలకు గోదావరి నీరు విడుదల చేసింది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలో ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి వ్యవసాయశాఖ అంచనా ప్రకారం 1,74,271 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఆ మేరకు 35,277 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా ఇప్పటికి 22,119 క్వింటాళ్ల విత్తనాలు, రైతుల వద్ద, ప్రైవేట్‌ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో 815 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉండగా కేజీ రూ.5 రాయితీపై సరఫరా చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌కు 45,775 మెట్రిక్‌ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం. ఎరువుల కొరత పరిస్థితి తలెత్తకుండా దిగుమతి చేస్తున్నారు.



కొత్తపేట ఆర్‌బీకే గోడౌన్‌లో ఎరువులు

జిల్లాలో ఎరువుల నిల్వలు

రకం	ప్రైవేట్‌ డీలర్ల వద్ద	ఆర్‌బీకేల్లో (మెట్రిక్‌ టన్నుల్లో)
యూరియా	10,273	7,618
కాంప్లెక్స్‌	24,240	3,691
డీఏపీ	4,184	1,058
ఎంఓపీ	889	900
సూపర్‌	1,134	365
మొత్తం	40,720	13,632

ప్రస్తుతం ప్రైవేట్‌ డీలర్ల వద్ద 40,720 మెట్రిక్‌ టన్నుల ఎరువులు ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా 13,632 మెట్రిక్‌ టన్నుల ఎరువులను పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ నిర్దేశించింది. ఆర్‌బీకేల్లో ఎరువులు సిద్ధంగా ఉంచారు.

కొరత లేకుండా చర్యలు



ఖరీఫ్‌ సీజన్‌కు ముందుగానే విత్తనాలు, ఎరువులు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేశాం. జిల్లాలో ప్రస్తుతం 152 ఎకరాల్లో నారుమడులు వేశారు. మిగతా విస్తీర్ణంలో ఎండలు తగ్గాక వేయనున్నారు. ఆర్‌బీకేల్లో విత్తనాలతో పాటు దశల వారీగా అవసరమైన ఎరువులను సరఫరా చేస్తున్నాం.

– వి.బోసుబాబు, జిల్లా వ్యవసాయ అధికారి, కోనసీమ జిల్లా

గరిష్ట స్థాయికి పొగాకు ధర

- రోజురోజుకు పెరుగుతున్న వైనం
- రూ.482 కోట్ల మేర విక్రయాలు


దేవరపల్లి: మార్కెట్లో పొగాకు ధర రికార్డుస్థాయికి చేరింది. ధర రోజురోజుకు పెరుగుతుంది. రోజుకు కిలోకు రూ.15 నుంచి 18 పెరుగుతుంది. రైతులు, అధికారులు ఊహించని విధంగా మార్కెట్లో పొగాకు ధరలు పెరగడంతో కొనుగోలుదారులు పోటీపడుస్తున్నారు. మార్కెట్లో ధర అనూహ్యంగా పెరగడంతో రైతులు కౌలు భూములు, బ్యారన్లకు ఎగబడుతున్నారు. ఫలితంగాకౌలు భారీగా పెరిగింది. బ్యారన్‌ కౌలు కూడా పెరిగినట్లు రైతులు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో గురువారం నాటికి రూ.482 కోట్ల విలువ గల 24 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి.

కిలో గరిష్ట ధర రూ.254, సగటు ధర రూ.201 లభించింది. బుధవారం మార్కెట్లో కిలో గరిష్ట ధర రూ.236 ఉండగా, గురువారం మార్కెట్లో రూ. 18 లభించింది. సగటు ధర కిలోకు ఒక రూపాయి పెరిగింది. పొగాకు మార్కెట్‌ ఆశాజనకంగా ఉండడంతో రైతుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. పొగాకు మార్కెట్‌ ఆశాజనకంగా ఉండడంతో వచ్చే ఏడాదికి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. గత ఏడాది ఎకరం కౌలు రూ.35 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.55 నుంచి 60 వేలు పలుకుతుంది. బ్యారన్‌ లీజు రూ. 1.80 లక్షలు పలుకుతుంది. కౌలు ధర చూసి చిన్న, సన్నకారు రైతులు బెంబేలెత్తిపోతున్నారు.



దేవరపల్లి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

వ్యవసాయ కోణంలో చూడాలి



మార్కెట్లో కొనుగోలు దారుల మధ్య పోటీ పెరిగింది. ఎగుమతి ఆర్డర్లు రావడంతో ఎగుమతిదారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ మార్కెట్‌ను చూసి రైతులు వచ్చే ఏడాదికి అధిక ధరకు భూములు, బ్యారన్లు తీసుకుంటే ఇబ్బంది పడతారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు జాగ్రత్తపడాలి. గత ఏడాది కంటే ఉత్పత్తి ఖర్చులు 15 నుంచి 20 శాతం పెరగ్గా, కిలో పొగాకుకు సగటున రూ.5 నుంచి 6 పెరిగింది. గత ఏడాది కిలో గరిష్ఠ ధర రూ.245 పలకగా, ఈ ఏడాది ప్రస్తుత మార్కెట్లో రూ.254 పలుకుతుంది. పొగాకు సాగును వ్యాపారంగా కాకుండా వ్యవసాయంగా చూడాలి.

– ఆదిశేషయ్య, పొగాకు బోర్డు రీజనల్‌ మేనేజరు, రాజమహేంద్రవరం

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పదిమందికి జైలు

కాకినాడ లీగల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో తొమ్మిది మందికి వారం రోజుల జైలు, రూ.10 వేలు చొప్పున జరిమానా, మరో వ్యక్తికి వారం రోజుల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎన్. ఉషాలక్ష్మి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ ప్రాంతంలో మద్యం సేవించి వాహనంపై వెళుతున్నారు. వారిని సర్పవరం సీఐ మురళీకృష్ణ పర్యవేక్షణలో పోలీసులు 10మందిని పట్టుకున్నారు. గురువారం కోర్టులో 10మందిని హాజరుపరచగా నేరం రుజువు కావడంతో పై విధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.



ఆత్రేయపురం మురిసింది

లా విద్యార్థుల సహకారం మరువలేం



మేం చాలాకాలంగా కోరుకుంటున్నది ఇన్నాళ్లకు సాకారమైనందుకు సంతోషంగా ఉంది. ముఖ్యంగా మాకు ఈ ప్రయత్నంలో అన్ని విధాలా సహకరించిన దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల తోడ్పాటు మరువలేం. ముఖ్యంగా ఇంటలెక్చువల్ ప్రాపర్టీ విభాగాధిపతి శ్రీసుధ సహకారం ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. పూతరేకులకు అన్ని రకాల వరి ఉత్పత్తులు పనికిరావు. మార్టేరు పరిశోధన కేంద్రం రూపొందించిన ఎంటీయూ 2636 రకం ధాన్యం మాత్రమే గట్టిగా ఉండి తర్వాత ఉత్పత్తికి అవసరమైన జిగురు వస్తుంది. పూతరేకుల తయారీపై మరింత మనసు పెట్టాలని ఈ ప్రాంత వాసులను కోరుతున్నాను.

– గాదిరాజు ప్రసాదరాజు, కాటన్ ఆత్రేయపురం పూతరేకుల వెల్ఫేర్ అసోసియేషన్ ట్రెజరర్



- పూతరేకుల తయారీలో భౌగోళిక గుర్తింపు
- నెరవేరిన ఈ ప్రాంతవాసుల కోరిక
- వ్యక్తమవుతున్న హర్షాతిరేకాలు

ఆత్రేయపురం: ఆత్రేయపురం అంటే గుర్తుకు వచ్చేది పూతరేకు. పూతరేకు అంటే గుర్తుకువచ్చేది ఆత్రేయపురం. ఈ రెండింటి మధ్య అంత బంధం ఉంది. తాజాగా ఆ బంధం మరింత బలపడింది. భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిటీ)తో ఆత్రేయపురం కీర్తి జాతీయ స్థాయికి చేరింది. తరతరాలుగా వారసత్వ సంపదగా వస్తున్న పూతరేకుల తయారీపై ఈ ఊరికే పూర్తి స్థాయి గుర్తింపు, హక్కులు ఉన్నాయని తేలింది.

జీఐ గుర్తింపు

బందరు లడ్డు, తిరుమల లడ్డు, ఉప్పాడ జాంధానీ, ఏటికొప్పాక కొయ్య బొమ్మలు, బొబ్బిలి వీణ, బంగినపల్లి మామిడి, అరకు కాఫీ, ధర్మవరం చీర ..ఇలా ఓ ఊరికో లేదా ప్రదేశానికో ప్రత్యేకతను ఆపాదించే ఉత్పత్తులకు జియోగ్రాఫికల్ ఐడెంటిటీ (జీఐ) లభిస్తుంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ పరిధిలో జీఐ ఉంటుంది. ఎంతో విశిష్టత, స్థానికతతో కూడిన చరిత్ర, గ్రామ భాగస్వామ్యం ఉంటే తప్ప జీఐ సాధ్యం కాదు. అలాంటి జాబితాలో ఇప్పుడు ఆత్రేయపురం పూతరేకు కూడా స్థానం సంపాదించింది. సగర్వంగా జాతీయ స్థాయిలో తలెత్తుకుంది.

పేపరు స్వీటుకు చరిత్ర

పూతరేకులకు పుట్టిల్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం. వందేళ్లకు పైబడి ఈ పేపరు స్వీటుకు చరిత్ర ఉంది. పూర్వం మైసూరుకు చెందిన ఒక మహిళ ఆత్రేయపురం కోడలిగా వచ్చింది. అప్పట్లో అన్నం వారుస్తుంటే గంజికుండపై రేకులాంటి పదార్థం ఏర్పడటం ఆమె గమనించింది. రుచి చూసి ముచ్చటపడింది. ఇలా ఆవిర్భవించిందే పూతరేకు. తొలిరోజుల్లో ఇక్కడ ఒక సామాజిక వర్గం మహిళలే రేకులు తయారు చేసి పంచదార అద్దేవారు. కాలక్రమంలో దీనిని అన్ని వర్గాలూ అనుసరించాయి. తమ ఉపాధిగా మలుచుకున్నాయి. ముఖ్యంగా ఈ ఊరి మహిళలది రేకులు తయారుచేయడంలో అందెవేసిన చేయి. 400 కుటుంబాలకు పైగా రేకుల తయారీలో నిత్యం బిజీగా ఉంటాయి. క్రమేపీ అభిరుచికి అనుగుణంగా పూతరేకు కొత్త రుచిని, రూపాన్ని సంతరించుకుంది.

జీఐ కోసం ఎంతో కృషి

తమ ఊరితో ఇంతగా అనుబంధాన్ని పెనవేసుకున్న పూతరేకుకు భౌగోళిక గుర్తింపు రావాలని ఆత్రేయపురం వాసులు చాన్నాళ్లుగా కోరుకుంటున్నారు. మూడేళ్లుగా ఇందుకోసం గట్టిగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఆర్థర్ కాటన్ ఆత్రేయపురం పూతరేకుల సంక్షేమ సంఘంతో పాటు మరికొందరు ఈ ప్రయత్నాల్లో పాలుపంచుకున్నారు. విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంలోని ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ విభాగం ఆధ్వర్యంలో లా స్టూడెంట్స్ వీరి కృషికి తోడయ్యారు. ఆత్రేయపురం వచ్చి పూతరేకుకూ ఈ గ్రామానికి ఏర్పడిన విడదీయరాని బంధానికి సంబంధించి వివిధ ఆధారాలను సేకరించారు. ఉపాధిగా మారి ఎగుమతుల స్థాయికి చేరిన ఈ ఆహార ఉత్పత్తిపై డాక్యుమెంట్లను తయారు చేశారు. 2021 డిసెంబరు 13న చెన్నైలోని జియో ఐడెంటిటీ కార్యాలయానికి దరఖాస్తును సమర్పించారు.

నిశిత పరిశీలన తర్వాత

కొద్ది నెలల అనంతరం చెన్నై కార్యాలయంలో దరఖాస్తు ప్రాసెస్ మొదలైంది. ఆధారాలతో సహా హాజరుకావాలని ఇక్కడివారికి ఆహ్వానం అందింది. ఆత్రేయపురం నుంచి ఏడుగురు జీఐ కార్యాలయానికి వెళ్లారు. వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మంది నిపుణులు వీరిని లోతుగా ప్రశ్నించారు. ఈ ప్రక్రియకు ఆన్‌లైన్ ద్వారా హాజరైన ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి గోనెల రాజేంద్రప్రసాద్ జీఐ అధికారుల ప్రశ్నలకు తగిన సమాధానాలు ఇవ్వగలిగారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న జీఐ జర్నల్‌లో ఆత్రేయపురం పూతరేకుల గురించి ప్రచురించింది. అభ్యంతరాలుంటే 120 రోజుల్లో తెలియజేయాలని సూచించింది. ఈ గడువు ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రితో ముగిసింది. ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. దీంతో ఆత్రేయపురం వాసుల కల నెరవేరింది. భౌగోళిక గుర్తింపు(జీఐ) లభించింది.

చాలా ఆనందంగా ఉంది



ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉంది. పూతరేకుల తయారీతో ఇప్పటికే మంచి గుర్తింపు వచ్చింది. ఇక మా ఆత్రేయపురానికి ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి లభిస్తుంది.

–జి.నాగమణి, ఆత్రేయపురం

ప్రోత్సాహం అందించాలి



చాలాకాలం నుంచి పూతరేకులు తయారు చేస్తున్నాం. పేద మహిళలు చాలామంది ఇదే ఆధారంగా బతుకుతున్నారు. ప్రోత్సాహం అందిస్తే పూతరేకుల వ్యాపారం మరింత పెరుగుతుంది. భౌగోళిక గుర్తింపు రావడం సంతోషంగా ఉంది.

–వేగిరాజు రాజేశ్వరీ, ఆత్రేయపురం

ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో జీవించాలి

సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి



గుర్తింపుకార్డు అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు: ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో జీవించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్ల హక్కులపై న్యాయ విజ్ఞానసదస్సు గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల గౌరవానికి ఎవరూ భంగం కలిగించకూడదని, అలా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ట్రాన్స్‌జెండర్లు వారి హక్కుల గురించి తెలుసుకోవడం చాలా అవసరమన్నారు. వారి సంక్షేమం కోసం అందుబాటులో ఉన్న పథకాలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే వారు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ట్రాన్స్‌జెండర్లకు పోలీస్ డిపార్ట్‌మెంట్ అండగా ఉంటుందని రాజమహేంద్రవరం ఏఎస్పీ జి. వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న డిసేబుల్ వెల్ఫేర్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్ ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ పథకాలను వివరించారు. డీపీపీసీయూ ప్రోగ్రాం మేనేజర్ ఆదిలింగం వారికున్న వైద్య సదుపాయాలను వివరించారు. ఆర్థికంగా బలపడేందుకు వారికి రుణాలు అందిస్తారని మెప్మా ప్రాజెక్టు మేనేజర్ కె.మోహన్ కుమార్ తెలిపారు. అనంతరం ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు న్యాయమూర్తి గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జె.మహేష్, దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె.తిరుమలరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ మాలతి, రెవెన్యూ, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్, డీఎంహెచ్‌వో పౌర సరఫరాల శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, ఎన్జీవో సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

సత్యదేవుని నమూనా ఆలయ నిర్మాణానికి ఆమోదం

రూ.3.57 కోట్ల నిర్మాణ టెండర్‌కు కమిషనర్ గ్రీన్‌సిగ్నల్

స్థానిక జాతీయ రహదారిపై రత్నగిరివాసుడు సత్యదేవుని నమూనా ఆలయం నిర్మాణానికి మరో ముందడుగు పడింది. స్వామివారి నమూనా ఆలయంతో పాటు ప్రసాద విక్రయ కౌంటర్, ఫుడ్ ప్లాజా, వెహికల్ పార్కింగ్, టాయిలెట్స్ బ్లాక్‌ల నిర్మాణానికి సంబంధించి రూ.3.57 కోట్ల టెండర్‌కు దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు ఒకటి రెండ్రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ గురువారం విలేకరులకు తెలిపారు.



సత్యదేవుని ఆలయం, ఇతర నిర్మాణాల నమూనా చిత్రం

లాంఛనంగా పనులు ప్రారంభం

దేవదాయశాఖ కమిషనర్ నమూనా ఆలయ నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బుధవారం లాంఛనంగా పనులు ప్రారంభించినట్లు ఈఓ తెలిపారు. గురువారం ఆయన నిర్మాణ స్థలంలో పనులను ఆయన పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. డిగ్రీ కళాశాల సమీపంలో దేవస్థానానికి గల 70 సెంట్ల స్థలాన్ని జాతీయ రహదారికి సమాంతరంగా ఎత్తు చేసి రిటైనింగ్ వాల్ నిర్మించి ఆ స్థలంలో స్వామివారి నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్, ఫుడ్ ప్లాజా, టాయిలెట్ బ్లాక్ నిర్మించేందుకు గత నెలలో రూ.3.44 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ పిలిచిన విషయం తెలిసిందే. ఆ టెండర్లను తొమ్మిదో తేదీన తెరవగా అంచనా వ్యయం కన్నా 4.95 శాతం అధికంగా పడిన టెండర్ లోయెస్ట్‌గా నిలిచింది.

అయితే రివర్స్ టెండర్, చర్చల ద్వారా కోట్ చేసిన టెండర్ కన్నా ఒక శాతం తక్కువగా అంటే 3.95 శాతం ఎక్కువకు టెండర్‌ను ఖరారు చేశారు. దీంతో రూ.3.57 కోట్లకు టెండర్ ఖరారైందని ఈఓ వివరించారు.

కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ

కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని సచివాలయాల్లో కార్యదర్శులకు గురువారం బదిలీల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల సమక్షంలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న 52 మందికి ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి, కాకినాడ నగరపాలక సంస్థతోపాటు ఏడు మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో పనిచేస్తున్న వివిధ విభాగాల కార్యదర్శులకు కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ జీవీఎస్ఎస్ మూర్తి, వివిధ పురపాలక సంఘ కమిషనర్లు జె.సురేంద్ర, టి.కృష్ణవేణి, టి.రామ్‌కుమార్, కె.శ్రీకాంత్‌రెడ్డి, డిజెఎస్ రాజు, వీఎల్ నాయుడు, జి.లోవరాజు హాజరయ్యారు.

వన్ వే సమ్మర్ స్పెషల్ రైలు రేపు

రాజమహేంద్రవరం సిటీ: వేసవి ప్రయాణికుల రద్దీని అనుసరించి జిల్లా మీదుగా శనివారం హుబ్లీ– విశాఖపట్నం (07305) వన్ వే సమ్మర్ స్పెషల్ రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు. విశాఖపట్నంలో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరే ఈ రైలు మరుసటి రోజు (18వ తేదీ) హుబ్లీ చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

పెదపూడి: లారీతో మోపెడ్ వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో లారీ డ్రైవర్ పి.సుబ్బారావుకు కాకినాడ పీజేసీఎం కోర్టు జడ్జి సుందరి గురువారం ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు పెదపూడి ఎస్సై వి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019 ఆగస్టు ఒకటో తేదీన రామేశ్వరం గ్రామానికి చెందిన వి.వరలక్ష్మి, కొండలరావు దంపతులు మోపెడ్ వాహనంపై కాకినాడ వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ రామేశ్వరంలో వారిని ఢీకొట్టింది. గాయాలపాలైన వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స అందించారు. దీనిపై కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం నగరంలోని మోరంపూడి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ రాత్రి 10 గంటల వరకు ఆ ప్రాంతం మీదుగా వెళ్లే వాహనాలకు సంబంధించి ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు జిల్లా ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి గురువారం తెలిపారు. నామవరం నుంచి మోరంపూడి సెంటర్ మీదుగా రాజమహేంద్రవరం నగరంలోకి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు సాయినగర్ దుర్గమ్మ టెంపుల్ వద్ద కుడి పక్కకు తిరిగి గాదాలమ్మ రోడ్డు మీదుగా అప్సర లాడ్జి వద్ద నుంచి నేషనల్ హైవేకి వెళ్లాలన్నారు.సాయినగర్ దుర్గమ్మ టెంపుల్‌కి ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా, గంగిరెడ్ల కాలనీ మీదుగా హుకుంపేట సెంటరుకు వెళ్లాలి. నామవరం నుంచి వచ్చే భారీ వాహనాలు సాయినగర్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా వున్న రోడ్డులో గాదాలమ్మ రోడ్డు మీదుగా నేషనల్ హైవేకి వెళ్లాలి. ఆర్టీసీ బస్టాండ్ నుంచి నామవరం వెళ్లే వాహనాలు మార్గాని ఎస్టేట్ ఎదురుగా వున్న పెద్ద రోడ్డు మీదుగా రైతుబజార్ సెంటర్, కవలగొయ్యి సెంటర్, నేషనల్ హైవే మీదుగా నిమ్మకాయల మార్కెట్ రోడ్డు (గాదాలమ్మ గుడి రోడ్డు) మీదుగా నామవరం వెళ్లాలి. పై ట్రాఫిక్ మళ్లింపు అంశాలను రాజమహేంద్రవరం పట్టణ, పరిసర ప్రాంత గ్రామ ప్రజలు గమనించాలని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం స్వాధీనం

సామర్లకోట: కాకినాడ కెనాల్ రోడ్డులో వీకే రాయపురం–మాధవపట్నం మధ్యలో గోదావరి కాలువలో ఉన్న మహిళ మృతదేహాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎస్సై గోపాలకృష్ణ, ఏఎస్సై మూర్తి ఘటనా ప్రదేశానికి చేరుకొని సమాచారం సేకరించారు. వారి కథనం ప్రకారం సుమారు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళ మృతదేహాన్ని గోదావరి కాలువలో గమనించారు. ముఖం గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతదేహం పై బ్లూ కలర్ జాకెట్టు, ఆకుపచ్చ చీరపై నలుపు, పింక్ రంగుల డిజైన్ కలిగిన చీర ఉంది. వివరాల కోసం సీఐ కె.దుర్గాప్రసాద్ 9440796568, ఎస్సై గోపాలకృష్ణ 7013004400 నంబర్లలో సంప్రదించాలన్నారు. కేసు ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

వంటనూనెల రంగంలో స్వయం సమృద్ధి


ప్రముఖ యోగా గురువు, పతంజలి ఆయుర్వేద బ్రాండ్ అంబాసిడర్ రామ్‌దేవ్‌బాబా




జి.దొంతమూరు ఆయిల్‌పామ్ తోటలో రైతులతో మాట్లాడుతున్న రామ్‌దేవ్‌బాబా

రంగంపేట: ఆయిల్‌పామ్ తోటల సాగుతో దేశం వంటనూనెల రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తుందని ప్రముఖ యోగా గురువు, పతంజలి ఆయుర్వేద బ్రాండ్ అంబాసిడర్ రామ్‌దేవ్‌బాబా అన్నారు. రంగంపేట మండలంలోని జి.దొంతమూరులోని ఆయిల్‌పామ్ తోటను ఆయన గురువారం పరిశీలించారు. రైతులనుద్దేశించి మాట్లాడారు. ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగినా, ఏటా వేలాది కోట్ల రూపాయల విలువైన వంట నూనెలను దిగుమతి చేసుకోవడం శోచనీయమన్నారు. పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ తోటలు పెంచాలన్నారు. ఈ విషయంలో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల తెలుగు రైతులను అభినందించాలన్నారు. దేశవ్యాప్తంగా ఆయిల్‌పామ్ తోటల సాగులో తెలుగు రైతుల వాటా 65 శాతం పైగా ఉండటం అభినందనీయమన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన ఆయిల్‌పామ్ తోటల ప్రోత్సాహక పథకం కింద అస్సాం, కర్ణాటక తదితర రాష్ట్రాలు ఈ పంట సాగుకు ముందుకు వస్తున్నాయన్నారు. పతంజలి గ్రూఫ్ ఆఫ్ కంపెనీ సీఈఓ సంజీవ్ ఆస్తానా మాట్లాడుతూ పతంజలి ఉత్పత్తులు నాణ్యతకు పెట్టింది పేరన్నారు. రైతుల తరపున ఉమ్మడి రాష్ట్ర ఆయిల్‌పామ్ రైతు సంఘం మాజీ అధ్యక్షుడు సత్తి రామారెడ్డి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటకు కనీస మద్దతు ధర ఉండేలా రామ్‌దేవ్‌బాబా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లా ఆయిల్‌పామ్ రైతు సంఘం అధ్యక్షుడు పెండ్యాల బుజ్జిబాబు, రుచిసోయా కంపెనీ ఉన్నతాధికారులు పట్టాభిరామిరెడ్డి, రవీంద్ర, రైతు నాయకులు ఉప్పలపాడు అమ్మిరాజు, పుట్టా సోమన్న చౌదరి పాల్గొన్నారు.


ఐసెట్ ఫలితాల్లో ప్రతిభ



ఎన్.మానస (12వ ర్యాంక్)



కె.కావ్యప్రియ (13వ ర్యాంక్)



వి.సత్యరాజేశ్వరి దేవి (22వ ర్యాంక్)

బాలాజీచెరువు: ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్–23 ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ విద్యార్థులు ప్రతిభ చూపారు. 50లోపు 8 ర్యాంకులు, 100లోపు 17 ర్యాకులు సాధించారని కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. 50లోపు 12,13,22,26,30,31,48,50తో పాటు 100లోపు 54,55,60,65,70,71,73,91,98 ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి విద్యార్థులను అభినందించి డిగ్రీ ప్రథమ సంవత్సరంలోనే అప్టిట్యూడ్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా మంచి ర్యాంకులు సాధిస్తున్నారని, మంచి యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సు పూర్తిచేసి ఉన్నత స్థాయికి వెళ్లడమే లక్ష్యం కావాలన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి నల్లమిల్లి సుగుణారెడ్డి, సీఆర్‌టీ ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి అభినందించారు.

రేపటి నుంచి వరుణ జపాలు

అన్నవరం: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురియాలని కోరుకుంటూ శనివారం నుంచి 21వ తేదీ వరకు శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వరుణ జపాలు నిర్వహించాలని దేవస్థానం ఆగమ కమిటీ సూచించినందున ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు గురువారం తెలిపారు. శనివారం ఉదయం 7–30 గంటలకు స్వామివారి ఆలయం వద్ద పండితులు ఋష్యశృంగ మహర్షి విగ్రహానికి పూజలు చేసి ఆవాహన చేస్తారు. అనంతరం సుబ్రహ్మణ్య ఆవాహన, వారుణాక వాక మంత్ర పఠనం, వరుణ జపాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17 నుంచి 21 వరకు ఉదయం 7–30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాలింత మృతిపై కేసు నమోదు

కాకినాడ రూరల్: బాలింత మృతిపై కేసు నమోదు చేశామని ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. కాకినాడ స్వామినగర్‌లో బాలింత పిల్లి గంగాభవాని(26) గురువారం ఉదయం మృతి చెందింది. ఆమెకు రమణయ్యపేట కొత్తూరు బర్మాకాలనీకి చెందిన పిల్లి నాగేశ్వరరావుతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 2017లో బాబు పుట్టాడు. మరోసారి గర్భిణి కావడంతో పుట్టింటికి కాన్పు కోసం వచ్చింది. నెల రోజులు క్రితం పాపకు జీజీహెచ్‌లో జన్మనిచ్చింది. ఇద్దరు పిల్లలు చాలు అనుకొని ఏడు రోజుల క్రితం జీజీహెచ్‌లో సిజేరియన్ చేయించుకుంది. ఇంటి వద్ద గురువారం ఉదయం ఆమె కళ్లు తిరిగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి నారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగరాజు తెలిపారు. బాలింతది సాధారణ మరణమని, తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.